క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్


చందా నరేష్

దమ్మపేట: మండల తహసీల్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా చందా నరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నరేష్‌ను ప్రజా ప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

మూడు రోజుల వ్యవధిలోనే మళ్లీ విధుల్లోకి..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట తహసీల్దార్‌గా కృష్ణ ప్రసాద్ మంగళవారం రిలీవ్ కాగా, తిరిగి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆయనను కొద్ది రోజుల క్రితమే బూర్గంపాడుకు బదిలీ చేసి, చర్ల తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను నియమించారు. కాగా అశ్వారావుపేట మండలం నియోజకవర్గం కేంద్రం కావడంతో ఎన్నికల నిర్వహణపై అనుభవం ఉన్న తహసీల్దార్ అవసరం కారణంగా, కలెక్టర్ ప్రియాంక అల ఎన్నికల సంఘానికి ప్రత్యేక వినతి చేశారు. ఈ మేరకు కృష్ణ ప్రసాద్‌నే మళ్లీ నియామకం చేస్తూ ఆదేశాలు రాగా, ఆయన స్థానిక కార్యాలయంలో విధుల్లో చేరారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో అధ్యాపక బృందం

చండ్రుగొండ : ఎర్రగుంటలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభచూపిన చండ్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థి జి.సాత్విక్ ఫైర్ ఫైటింగ్ రోబో ప్రాజెక్ట్ చేసి జిల్లాస్థాయిలో రెండో బహుమతి పొందాడు. ఈ మేరకు సాత్విక్‌తోపాటు ప్రతిభ చూపిన మరో 8 మంది విద్యార్థులను అభినందించారు.

తాత్కాలిక పోస్టులకు ఇంటర్వ్యూలు

మణుగూరు రూరల్: మణుగూరు ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో హిందీ పండిట్, మేల్ అటెండర్ పోస్టుల భర్తీ కోసం శుక్రవారం ఏరియా డీజీఎం (పర్సనల్), పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వరూపారాణి, హిందీ పండిట్ ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు హసీనా బేగం, కల్యాణి, అనురాధ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ సమస్యలపై అధికారులు జోక్యం చేసుకుని వాటిని పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని కూనవరం రోడ్డులో గల డిగ్రీ కళాశాల వద్ద హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ తమ సమస్యలు పరిష్కరించాలని మూడు రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో శుక్రవారం సీపీఎం నాయకులు పాల్గొని పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పీఎంహెచ్ హాస్టళ్లలో అవుట్ సోర్సింగ్‌గా పనిచేస్తున్న కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడం చాలా ఇబ్బంది పడుతున్నారని, వారికి ప్రతీ నెల సక్రమంగా జీతాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా ఏర్పాటయిన ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలని చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

వితరణ

దమ్మపేట: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న చిన్నంశెట్టి మోహన్‌రావు జన్మదినం సందర్భంగా, ఆయన బంధువులు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు భాస్కరాచారి, రేణుక, సైదులు, సతీష్, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిన్నశెట్టి గోపి, రొయ్యల కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు ప్రూనింగ్ చేపట్టాలి

బూర్గంపాడు: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తునికాకు ప్రూనింగ్ పనులను త్వరితగతిన చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గతేడాది తునికాకు సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను వెంటనే అందించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, సేకరణ ధరలను కూడా పెంచి ఆదివాసీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మక్కువ ఉన్నా.. క్రీడా మైదానాలు కరువు

ఆటలకు దూరమవుతున్న ఏజెన్సీ యువత

- క్రీడా మైదానాలు లేక ఇక్కట్లు....
- వాకింగ్ ట్రాకులుగా రహదారులు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు


ట్రాక్ లేక రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్న స్థానికులు

చర్ల రూరల్: ఆటలపై మక్కువ ఉన్నప్పటికీ ఆటలాడేందుకు మాత్రం క్రీడా మైదానాలు లేక మండలంలో యువత ఎన్నో ఇక్కట్లు పడుతున్నారు. చర్లలో క్రికెట్ ఆటకు ఒక చరిత్రగా చెబుతూ వచ్చేవారు. చర్లలో క్రికెట్ ఆడేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి సైతం క్రీడాకారులు రావడంతో పాటు ఐపీఎల్ ఆటగాళ్లు కూడా చర్లకు వచ్చి క్రికెట్ ఆడిన సంఘటనలు లేకపోలేదు. క్రీడాకారులు, కళాకారులకు ఎంతో పేరు ప్రఖ్యాతలున్న మండలంలో ఇంతవరకు క్రీడా మైదానం ఏర్పాటుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ముందుకు రాకపోవడంపై మండల యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా చర్లలో క్రికెట్ పోటీలు ఎంతో రసవత్తరంగా సాగుతూ వస్తున్నాయి. ఈ మేరకు చర్లలో క్రీడా మైదానం లేనప్పటికీ ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో ఇన్ని సంవత్సరాలు ఆడుతున్నారు. మైదానాలు ఏర్పాటుచేసి ప్రభుత్వం సహకారం అందజేస్తే మరింత రాణిస్తామని క్రీడాకారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

ప్రస్తుత తరుణంలో యువత చెడుదోవ పట్టకుండా ఉండాలంటే కొంతవరకు అది క్రీడలతోనే సాధ్యమని చెప్పొచ్చు. మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. యువత మద్యం, ధూమపానం, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉండాలంటే ప్రభుత్వం స్పందించి క్రీడా మైదానాలను నిర్మించి క్రీడాకారులకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్లపైనే వాకింగ్..

క్రీడాకారులతో పాటు స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునే అవకాశం కూడా లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం వాకింగ్ చేసే అవకాశం లేక రోడ్లపైనే వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై తిరిగే వాహనాలతోపాటు కుక్కలతో రోడ్లపై వాకింగ్ ప్రమాదకరమని తెలిసినప్పటికీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఎన్నో జాగ్రత్తలు పాటిస్తూ వాకింగ్ చేయడం తప్పక చేస్తున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


మైదానం లేక ప్రైవేట్ స్థలంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

క్రీడా మైదానం నిర్మించాలి



క్రీడలపై ఎంతో ఆసక్తి ఉన్నప్పటికీ చర్లలో క్రీడా మైదానం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాము. ఎన్నో ఏళ్లుగా మైదానం లేక స్థానిక యువత ప్రైవేటు ప్రదేశాలలో క్రీడలను ఆడుతూ వచ్చాం. క్రికెట్‌తో అన్ని క్రీడలు ఆడుకునే విధంగా చర్ల మండల కేంద్రంలో అనువైన స్థలాన్ని కేటాయించి అన్ని వసతులతో క్రీడా మైదానం నిర్మించాలి.

– ఆర్.అరుణ్, క్రీడాకారుడు, చర్ల

క్రీడలపై ఆసక్తి పెంచాలి



నేటి యువత చెడుదోవ పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెరిగేలా మండల కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో క్రీడా మైదానాన్ని నిర్మించాలి. అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు సైతం జరిగే చర్ల లో క్రీడా మైదానం లేకపోవడం బాధాకరం. క్రీడాకారులతో పాటు స్థానికులు వాకింగ్ చేసుకునే విధంగా మైదానంలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలి.

– ఆలం ఈశ్వర్, క్రీడాకారుడు, చర్ల

హరిత బస్టాండ్‌గా మార్చాలి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


అశ్వారావుపేటరూరల్: బస్టాండ్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: వచ్చే మూడు నెలల్లో అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను హరిత బస్టాండ్‌గా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆయన చేతుల మీదుగా పలు రకాల మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఆవరణలో మొక్కలు పెంచి ఆహ్లాదకరంగా ఉంచాలన్నారు. అనంతరం మండలంలోని నారాయణపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయ జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్‌లు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, నాయకులు జూపల్లి ప్రమోద్, సుంకవల్లి వీరభద్రరావు, తుమ్మా రాంబాబు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, ఎస్‌కే ముబారక్ బాబా, సత్యనారాయణ,రేమళ్ల కేధార్‌నాథ్, అల్లాడి రామారావు, ఎంపీటీసీలు మిండా హరి, వేముల భారతి, ప్రతాప్ పాల్గొన్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి..


దమ్మపేట: కోతకు గురైన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

దమ్మపేట: దమ్మపేట గ్రామంలోని శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో వంతెన ఇటీవల వచ్చిన వరదల కారణంగా వంతెన తెగిపోగా పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వంతెన మరమ్మతులు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మండలంలో ఆయన శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికకానున్న పాలక వర్గ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించారు. నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్. పగడాల రాంబాబు, సత్యనారాయణ, సత్యనారాయణ, చిట్టిబాబు, కృష్ణారావు, పెదబాబు, చినబాబు పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలి


మణుగూరు రూరల్: ఎమ్మెల్యే పాయంను సన్మానిస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య మాట్లాడుతూ.... 2012 వరకే ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారని, ఆ తర్వాత ఏజెన్సీ డీఎస్సీ ఉద్యోగ ప్రకటనే లేదని, తద్వారా ఆదివాసీల్లో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయంకు పూలమొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు వాగబోయిన శ్రీను, పూనెం రమణబాబు, రాజేష్, సోలం వెంకటరమణ, పూనెం వసంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

అశ్వాపురం: మండలంలోని మొడికుంట గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ కమటం నరేష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి


అశ్వారావుపేటరూరల్: సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రతీ చిన్నారికి చుక్కల మందు వేసి విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, సీడీపీఓ రోజారాణి, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో నల్లా ఏర్పాటు


నల్లా ఏర్పాటు చేస్తున్న ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు పంచాయతీలోని రాంనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అధికారులు శుక్రవారం మిషన్ భగీరథ నల్లా ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం సాక్షిలో ప్రచురితమైన తాగునీటికి విద్యార్థుల అవస్థలు కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. పాఠశాలలో మిషన్ భగీరథ పైపులైన్‌కు నల్లా ఏర్పాటు చేసి తాగునీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ కిశోర్, అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రిని టెంపుల్ సిటీగా ప్రకటించాలి


నిరసన దీక్షలో నాయకులు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణాన్ని టెంపుల్ సిటీగా ప్రకటించాలని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో భద్రాచలాన్ని టెంపుల్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఒక్క రోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రామాలయంతో పాటు పట్టణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని, అలాగే సెంట్రల్ రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షం

చర్ల: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై జెడ్పీటీసీ ఇర్పా శాంత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్రం వస్తే నిధులు, నీళ్లు, నియామకాలు వస్తాయని మభ్యపెట్టిన కేసీఆర్ నిరుద్యోగులకు ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 83వ రోజునే ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేయడం వరంలాంటిదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం దూసుకుపోతున్నాయని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.

కార్మికులకు తీవ్ర అన్యాయం


బూర్గంపాడు: మాట్లాడుతున్న నర్సారెడ్డి


అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న నరసింహారావు

బూర్గంపాడు: ప్రధాని మోదీ పాలనలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబి.నర్సారెడ్డి అన్నారు. సారపాకలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం, పెయింటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తు కార్మిక కుటుంబాలను పేదరికంలోకి నెడుతున్నాయన్నారు. లేబర్ ఇన్సూరెన్స్‌ను ఎత్తివేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కుట్ర చేసిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు,సెగ్గం శ్రీను, తోట మల్లయ్య, సీహెచ్ రమణయ్య, నూనె వెంకన్న, జర్పుల బిక్య, ఓర్సు పండు, అనుమ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: భవననిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు నరసింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాజాపురం గ్రామంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడికి లేబర్ ఇన్సూరెన్స్ ఉండాలని, కార్మిక ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు రామిశెట్టి కృష్ణయ్య, సీపీఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, యాకూబ్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మినీ మేడారం..


సుంకు జాతర సందర్భంగా గ్రామంలో ఊరేగింపు..

- వనదేవతలకు మొక్కులు సమర్పణ


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దుమ్ముగూడెం : మండలంలోని మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరలో శుక్రవారం సుంకు పండుగ సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మలను భక్తులు దర్శించుకుని పూజలను నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మణుగూరు రూరల్: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.రాఘవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మణుగూరు రెవెన్యూ పరిధిలోని ఉడతానేని గుంపు, సీటైప్, గనిబోయిన గుంపు, గుట్టమల్లారం, పాత మణుగూరు ప్రాంతాల్లో తహసీల్దార్ రాఘవరెడ్డి సిబ్బందితో కలిసి పర్యటించి ప్రభుత్వ భూములను సర్వే చేసి గుర్తించారు. సర్వేలో ఆక్రమణకు గురైన ఆయా ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలను అడ్డుకుని భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ఆయా భూములలో క్రయ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన..


మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎంఎస్‌ఎంఈ యూనిట్ యజమానులకు ఆయుష్ అసోసియేట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని, దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి యూనిట్‌కు వచ్చే ఎలాంటి పథకానికైనా అర్హులవుతారన్నారు. ఈ సర్టిఫికెట్‌ను ఆయుష్ అసోసియేట్స్ సంస్థ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్లకు ఉచితంగా అందజేస్తుందని, యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శంకర్ పవర్, గిరిధర్, వెంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో కలపాలి

భద్రాచలంటౌన్: రాష్ట్రంలోని వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో కలపాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శివాజీ అన్నారు. భద్రాచలం పట్టణం అంబేడ్కర్ సెంటర్‌లోని రైతువేదికలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వడ్డెర సంఘం ఆత్మ గౌరవ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర కులస్తులు వెనుకబాటు తనంతో ఆర్థికంగా, రాజకీయంగా ఎదగలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక లక్ష్మయ్య, జాతీయ అధ్యక్షురాలు మల్లెల నిర్మల, గుంజా వెంకటేశ్వర్లు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

దమ్మపేట: మాదిగ జాతి భవిష్యత్ కోసం, ప్రాణాలను సైతం త్యాగం చేసిన మాదిగ అమరులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శుక్రవారం మాదిగ అమరులకు నివాళులర్పించిన ఎమార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ కులాల వర్గీకరణ కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలికపోగు కాంతారావు, వెంకటేశ్వరరావు, ముసలయ్య, సీతారాములు, వీరయ్య పాల్గొన్నారు.

జామియా మసీద్ సదర్‌గా షమీ హుసేన్

చండ్రుగొండ : మండలకేంద్రంలోని జామియా మసీద్ కమిటీ సదర్‌గా రెండోసారి ఎండి.షమీహుసేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం షోరా కమిటీ షమీహుసేన్ నియామకాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో షోరా కమిటీ సభ్యులు ఎండి.యాకూబ్‌అలీ, ఇమాం సాహెబ్, రహీం సాహెబ్, ఎంఏ వాహెద్, భోజా, అహెమద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

అశ్వారావుపేటరూరల్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను శుక్రవారం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం తనిఖీలు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనారిటీ గురుకుల కళాశాల, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కాగా ఈ మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 49 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని చీఫ్ సూపరింటెండెంట్ దామెర నరసింహారావు తెలిపారు.